క్లుప్తంగా

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. ఏడాది కాలంలో రూ.3కోట్లతో ఉపాధిహామీ పనులు చేపట్టామన్నారు. వీటిపై ప్రజావేదికలో చర్చిస్తారని పేర్కొన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత



మహేశ్‌కు ఫోన్ అందిస్తున్న ఎస్సై ఉమాసాగర్

వెల్గటూర్: ఎండపల్లి మండలం పాతగూడూర్‌కు చెందిన బోయిని మహేశ్ గత నెలలో బైక్‌పై వెళ్తూ తన ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. తన ఫోన్ పోయిందని వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తి


చింతల చెరువు తూము మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డీఈ

సారంగాపూర్: వర్షాలు ప్రారంభమయ్యే లోపు చింతల చెరువు తూము మరమ్మతు పనులను పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ డీఈ చక్రూనాయక్ తెలిపారు. సారంగాపూర్ శివారులోని చింతల చెరువు తూముకు రూ.4.50లక్షలు మంజూరు కాగా.. మరమ్మతు పనులు ప్రారంభించారు. పనులను సత్వరమే పూర్తి చేసి రైతులకు నీటినందిస్తామన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు కాలగిరి మధుసూదన్‌రెడ్డి, అల్లెపు చిన్నయ్య తదితరులున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెగడపల్లి: ఉపాధిహామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతుల నుంచి పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. 2.5ఎకరాల్లోపు భూమి ఉన్న పట్టాదారులు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బావి, కరెంట్ సౌకర్యం కలిగి ఉన్న రైతులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్, సపోటా, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరేడు మొక్కలు పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా తోటలు పెంచుకోవాలనుకున్న రైతులకు గుంతలు తీసేందుకు, మొక్కలు నాటడం, మొక్కకు ఊతకర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి నెలనెలా వాటి పర్యవేక్షణకు మూడేళ్లపాటు ఉపాధి హామీ నుంచి యాజమాన్యం కింద డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. దరఖాస్తు పత్రం, పట్టాదారు పుస్తకం, బ్యాంక్ అకౌంట్, జాబ్‌కార్డు, పాస్‌కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్టు ఫొటోలు, పంచాయతీ తీర్మాన పత్రం జతపరిచి పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, ఏపీవోలకు సమర్పించాలని సూచించారు.

తడిచిన ధాన్యం మిల్లుకు తరలింపు



వెల్గటూర్: బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా పూర్తిగా తడిచాయి. జిల్లావ్యాప్తంగా తడిచిన ధాన్యం బస్తాలను కోతలు లేకుండా మిల్లులకు తరలించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా తడిచిన ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెల్గటూర్ మండలం పాశిగామ సెంటర్ నుంచి 1,929 బస్తాలు, స్తంభంపల్లి సెంటర్ నుంచి 1,365 బస్తాల తడిచిన ధాన్యం సమీపంలోని మిల్లులకు తరలించారు. రైతులు ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మాపూర్ సింగిల్‌విండో సీఈవో ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

జగిత్యాలక్రైం: మల్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గామ గ్రామ శివారుల్లో కొన్ని సంవత్సరాలుగా రాంపూర్ గ్రామానికి చెందిన దళితులు శ్మశాన వాటిక ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం శ్మశాన వాటిక స్థలాన్ని మిరుప భూమయ్యరెడ్డి, చెట్టి గణేశ్‌రెడ్డి కబ్జా చేసే ప్రయత్నం చేయగా.. రాంపూర్‌కు చెందిన చిట్యాల విజేందర్, దువ్వాక మల్లేశ్, బదుగు లక్ష్మణ్, గంగాధర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నలుగురిని కులం పేరుతో దూషించడంతోపాటు చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని, విజేందర్ ఫిర్యాదు మేరకు భూమయ్యరెడ్డి, గణేశ్‌రెడ్డిపై అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆహ్లాదానికి ఆమడ దూరం

- పల్లె ప్రకృతి వనాల్లో నిర్వహణ లోపం
- ఎండుతున్న మొక్కలు
- ప్రజలకు అందుబాటులో లేని వైనం


పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

సారంగాపూర్: ప్రభుత్వం హరితహారం లక్ష్యం చేరుకోవడం, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు గ్రామ పంచాయతీల పరిధిలో భూములు అందుబాటులో లేకపోవడంతో చాలా గ్రామాల్లో అటవీ శాఖ సహకారంతో గ్రామాలకు దూరంగా అటవీ శాఖ భూముల్లో వీటిని ఏర్పాటు చేశారు.

అన్ని గ్రామాల్లో..

సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాలు, బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతి పల్లె ప్రకృతి వనంలో అక్కడ అందుబాటులో ఉన్న స్థల విస్తీర్ణం ఆధారంగా 2వేలకు పైగా వివిధ రకాల పువ్వులు, నీడనిచ్చే మొక్కలను నాటారు. 2019లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.2లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. 2022 వరకు మరో రూ.2లక్షలు నిర్వహణ ఖర్చు కింద ఈజీఎస్ నిధులను వెచ్చించారు.

కనిపించని ఆహ్లాదం

2022 వరకు ఉపాధిహామీ నిధులతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాగానే సాగినా.. 2023 నుంచి పంచాయతీలకు వీటి నిర్వహణ అప్పగించారు. గ్రామ పంచాయతీల ట్రాక్టర్లకు ట్యాంకర్లున్నా.. పంచాయతీల్లో నిధుల కొరత, నిర్లక్ష్యం కారణంగా నీరందక చాలా మొక్కలు ఎండిపోయాయి. మొత్తం పిచ్చి మొక్కలు, చెత్తతో నిండిపోయాయి.

- పెంబట్ల పల్లె ప్రకృతి వనం రంగపేట గ్రామ రహదారిని ఆనుకొని ఉంది. ఇది గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- ధర్మనాయక్‌తండా పల్లె ప్రకృతి వనం రంగపేట రహదారిని ఆనుకొని గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది.
- పోతారం గ్రామంలో గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- బట్టపల్లి, లచ్చనాయక్‌తండా, రేచపల్లి, మ్యాడారంతండా, లక్ష్మీదేవిపల్లి పల్లె ప్రకృతి వనాలు కూడా గ్రామాలకు దూరంగా ఉన్నాయి.
- రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో తుంగూర్, కొల్వాయి పల్లె ప్రకృతి వనాలకు చాలా నష్టం జరిగింది. ఈ రెండు వనాలు కూడా గ్రామ శివారుల్లో ఉన్నాయి.
- నర్సింహులపల్లె, బీర్‌పూర్ వనాల పరిస్థితి కూడా పైగ్రామాల మాదిరే ఉంది.

ఎండతో ఎండిన మొక్కలు

మొక్కలు ఎండిపోవడానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు కొడుతున్నాయని, వేసవి తీవ్రత కారణంగా పల్లె ప్రకృతి వనాల్లో ఎక్కువ మొక్కలు చనిపోయాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఆసుపత్రులకు నిరంతరం విద్యుత్ సరఫరా


జనరేటర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణ

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాలజోన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలో రెండు సర్వీస్ కనెక్షన్లతోపాటు 125 కేవీఏ సామర్థ్యం గల మూడు జనరేటర్ల పనితీరు బాగుందన్నారు. ధరూర్ క్యాంపులోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో హైవాల్యు సర్వీస్ కనెక్షన్‌తో పాటు 125 కేవీఏ సామర్థ్యం గల జనరేటర్ అందుబాటులో ఉందన్నారు. డీఈ రాజిరెడ్డి, ఏడీఈ టెక్నికల్ నగేష్‌కుమార్, ఏఈ రహీం ఉన్నారు.

రామన్నపేటలో అవగాహన సదస్సు

మల్యాల: రామన్నపేట గ్రామంలో గురువారం రాత్రి మల్యాల ఎస్సై కుమారస్వామి పోలీసులు అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, ఆపద సమయాల్లో డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయినాథుడి ఆలయంలో పౌర్ణమి వేడుకలు


మల్యాల: భక్తులకు అన్నదానం


రాయికల్: హాజరైన భక్తులు

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీదత్తసాయి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రాయికల్: ఇటిక్యాల గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సాయినాథుడికి అర్చకుడు శివశంకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మండలంలోని భక్తులు సాయినాథున్ని దర్శించి పూజలు చేశారు. మహిపాల్‌రెడ్డి, నవీన్, చురకంటి నాగిరెడ్డి, రాజేశం, సామల్ల మధు, చిన్నలింబాద్రిగౌడ్, చిన్న లక్ష్మణ్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: పొలాస శివారులోని సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు గంగరాజం పాల్గొన్నారు.

‘ఉపాధి’లో కూలీల సంఖ్య పెంచాలి


పెగడపల్లిలో మాట్లాడుతున్న ఏపీడీ

పెగడపల్లి: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి ఎంపిక చేసిన పనులు పూర్తయ్యేలా చూడాలని డీఆర్డీవో ఏపీడీ మదన్‌మోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్ఏలు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. పనులకు హాజరవుతున్న కూలీలు, గిట్టుబాటు వేతనం, పనుల పురోగతిపై గ్రామాలవారీగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు పనులు జరగాలని, కొలతల్లో తేడాలొస్తే చర్యలుంటాయన్నారు. జూన్‌లో వర్షాలు కురిస్తే హరితహారం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రతి గ్రామానికి 10వేల మొక్కలకు తక్కువ కాకుండా నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, ఇప్పటినుంచే స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీవో వేణు పాల్గొన్నారు.

పశు సంచార వాహనాల తనిఖీ


పశు సంచార వాహనాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్

ధర్మపురి: మూగ జీవాలకు సేవలందించే పశు సంచార వాహనాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్ బగీస్ మిశ్రా ఆధ్వర్యంలో జిల్లాలోని పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్లు, పశువుల వైద్యానికి ఉపయోగించే వైద్య పరికరాలను పరిశీలించారు. పశువులకందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందినడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సాయితేజ, పారామెట్ మల్లేశ్, పైలెట్, సహాయకుడు శివ తదితరులున్నారు.

రామాయణం నాటక ప్రదర్శనకు స్పందన



మల్యాల: మండల కేంద్రంలోని పెద్దమ్మవాడలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న చిడుతల రామాయణం నాటక ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. స్థానిక రంగస్థల నటుడు రాగుల రవీందర్ ఆధ్వర్యంలో స్థానికులు నాలుగు నెలలపాటు చిడుతల రామాయణంపై శిక్షణ తీసుకొని పలు గ్రామాల్లో ప్రదర్శనలిస్తున్నారు. 45 పాత్రల్లో 23 మంది వివిధ పాత్రలు పోషిస్తున్నారు. దశరథుడిగా గుమ్మడి మల్లేశం, శ్రీరాముడిగా పల్నాటి సంతోష్, సీతాదేవిగా బొద్దుల మహేందర్, లక్ష్మణుడిగా కుసుమ గణేశ్, భరతుడిగా దాసరి గంగారాం, ఆంజనేయుడిగా కొక్కుల సుధాకర్, సుగ్రీవుడిగా వేముల సంతోష్ ప్రదర్శనలిస్తూ మన్ననలు పొందుతున్నారు.

శ్రీకృష్ణ గీతాశ్రమ వార్షికోత్సవం

ధర్మపురి: తీగళధర్మారం గ్రామంలో శ్రీకృష్ణ గీతాశ్రమ 44వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. యజ్ఞ నిర్వాహకులు వేముల రామ్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిపారు. శ్రీకృష్ణ అభిషేకం, తులసి పూజ, గోపూజ, పంచకుండి యజ్ఞం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, గంధం రమేశ్, తిరుపతి తదితరులున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జాతర



కథలాపూర్: తాండ్ర్యాల గ్రామంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం జరిపించారు. యజ్ఞం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అర్చకుడు సీతారామాచార్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


పోచమ్మ ఆలయంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో గురువారం మాల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాల పండగ నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ దేవాలయంలో నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

సత్యనారాయణ వ్రతాలు


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలు

ఇబ్రహీంపట్నం: గొధూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు లక్ష్మణమూర్తి సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలతో ప్రత్యేక పూజలు, వ్రతాలను చేయించారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జగన్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి కల్యాణం


పెగడపల్లిలో స్వామివారి కల్యాణం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను శోభాయాత్రతో కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. అర్చకుడు గుండి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు

జగిత్యాల: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో పట్టణంలోని నవ్య కళాశాలలో చదువుతున్న సరిగల శ్రీయ 2009వ ర్యాంక్ సాధించగా.. విద్యార్థిని అభినందించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె వద్ద స్వామిరెడ్డి

జగిత్యాలరూరల్: అంతర్గాం గ్రామానికి చెందిన బొందుగుల స్వామిరెడ్డి పాడి గేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ శివారులో గేదె మేతకు వెళ్లగా.. త్రీఫేస్ విద్యుత్ తీగ తెగి కింద పడింది. ఈక్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రవేశం కోసం ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులు సాధించి మంచి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉచితంగా చదువుతున్నారని అధ్యాపకులు పేర్కొన్నారు. పెంబట్లలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు గురువారం వెళ్లారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత నాణ్యమైన విద్య ద్వారా వందలాది మంది ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్నారని, సారంగాపూర్ కళాశాలలో చేరాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కొంక వేణు, అధ్యాపకులు రాజేందర్, వెంకటేశ్వర్లు, సతీష్, రాజ్‌కుమార్, రాజు, సౌజన్య, సుజాత, జూనియర్ అసిస్టెంట్ రమణ తదితరులున్నారు.

మల్లాపూర్: ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులను మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని ఆ కళాశాల అధ్యాపకులు రాజేందర్, అరవింద్ అన్నారు. గురువారం సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రైవేట్ కళాశాలలకు దీటుగా జిల్లాలో ఉత్తమ ఉత్తీర్ణత శాతం ఫలితాలను సాధించాయన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన కంప్యూటర్లు

ఇబ్రహీంపట్నం: ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి.. తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు కాలిపోయాయి. అలాగే తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ఎంపీడీవో కార్యాలయంలోని ఉపాధి హామీ విభాగానికి చెందిన మరో కంప్యూటర్ కాలిపోయింది. ఆ పక్కనే ఉన్న వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని రెండు ఫ్యాన్లు కాలిపోయాయి. కార్యాలయాలకు వెళ్లే విద్యుత్ వైర్లు దగ్గరదగ్గరగా ఉండటంతో ఈదురుగాలులకు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అవుతున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ విధానమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి అన్నారు. సిరిపూర్, గుండంపల్లి, సాతారం, రేగుంటకు చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నవీన్‌రెడ్డిని నియమిస్తూ లేఖ అందించారు.

కళాశాల కల నెరవేరేనా..?

- ఉన్నత విద్యకు దూర ప్రాంతాలే దిక్కు
- దశాబ్దాలుగా ఎదురుచూపులు


కళాశాల ఏర్పాటుకు అనువైన పాఠశాల ప్రాంగణం

బుగ్గారం: గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బుగ్గారం గ్రామం నుంచి రాష్ట్ర రాజకీయాల్లో మంచి గుర్తింపు పొందిన ఎంతోమంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ కేంద్రమైన బుగ్గారం గ్రామం చెప్పుకోదగ్గ అభివృద్ధి సాధించలేదు. తరువాత నియోజకవర్గ కేంద్రాన్ని ధర్మపురికి మార్చారు. మండలాల పునర్విభజనలో భాగంగా 11 గ్రామాలతో బుగ్గారం నూతన మండలంగా ఏర్పాటైంది. ఈక్రమంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కానీ విద్య, వైద్యపరంగా ఆశించిన పురోగతి కరువైంది.

ఇంటర్ కళాశాల కోసం ఎదురుచూపులు

మండలంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాలుగా నెరవేరడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. స్థానికంగా కళాశాల ఏర్పాటు చేస్తే మండలంలోని మారుమూల గ్రామాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలంటున్నారు. ఇందుకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఎంతో అనువుగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. బుగ్గారంలో ఏర్పాటు చేస్తే సమీపంలోని వెల్గటూర్, గొల్లపల్లి మండలాల పలు గ్రామాల విద్యార్థులకు సైతం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని మండలవాసులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బుగ్గారం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 8 ఉన్నత పాఠశాలలున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులైన వందలాది విద్యార్థులు ఇంటర్ చదువు కోసం జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. దీంతో వీరికి దూరాభారమే కాకుండా ఆర్థిక భారం పెరుగుతుంది. ఈక్రమంలో పలువురు విద్యార్థులు పదోతరగతి తర్వాత చదువు మానేస్తున్నారు. ఇకనైనా మండల కేంద్రంలో ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలకు ఎంతో సౌకర్యం



బుగ్గారంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థినీవిద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా బాలికల్లో డ్రాపవుట్స్ తగ్గుతారు. అనేక మంది తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. కళాశాల ఏర్పాటు గురించి గతంలో పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించాం.

– చుక్క గంగారెడ్డి, సామాజిక కార్యకర్త

బుద్ధ జయంతి


బుద్ధ విగ్రహానికి పూలు చల్లుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: గొధూర్ గ్రామంలో గురువారం బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూలాభిషేకం చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కొటగిరి మురళి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, విగ్రహదాత బురం జనార్దన్, ఎండీ రహీం, తెలుకంటి గంగాధర్, బురం నారాయణ, సత్పడి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్సై సేవలు మరువలేనివి

జగిత్యాలక్రైం: రిటైర్డ్ ఏఎస్సై జగన్మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన రిటైర్డ్ ఏఎస్సై జగన్మోహన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్నారు. జగన్మోహన్‌రెడ్డి తన విధి నిర్వహణలో ఎంతో కృషి చేశారన్నారు.